సాక్షి ఒడిశా
శనివారం ౹ 12 ౹ ఏప్రిల్ ౹ 2025



14న ర్యాలీ

కొరాపుట్‌లో 14న ఏక్తావాహినీ ర్యాలీ జరగనుంది. ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- 10లో



సీతాదేవికి కుంకుమ పూజ

జయపురంలో సీతాదేవికి కుంకుమ పూజలు జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- 10లో



కళాకారులకు చేయూత..

కళాకారులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. కొరాపుట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.

- 10లో

ఆయుష్మాన్ భవ



లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న చైర్మన్

జయపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, గోపబంధు జన ఆరోగ్య యోజక కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం జయపురం విక్రమ క్రీడా మైదానంలో ప్రారంభమైంది. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, మున్సిపాలిటీ కార్యనిర్వాహక సహాయ అధికారి కృతిబాస్ సాహు, మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అరుణ కుమార్ పాడి మొదలగు వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్, యోజన పథకంలో కార్డులు అందజేశారు.

గజపతి జిల్లాలో..

పర్లాకిమిడి: ఆయుష్మాన్ పీఎం జన ఆరోగ్య యోజన పథకం (పి.యం.జె.) కింద ఆరోగ్యకార్డులను పర్లాకిమిడిలో ఒడ్డిమంగళ వీధిలో ఏర్పాటుచేసిన వేదికపై ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. పర్లాకిమిడి పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి, జిల్లా స్వాస్థ్య అధికారి డాక్టర్ రబినారాయణ దాస్, పురపాలక ఈఓ లక్ష్మణ్ కుమార్ సాహు, అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భబేష్ పండే, బిద్యుత్ పట్నాయిక్, కౌన్సిలర్లు బాల కృష్ణ పాత్రో, బబునా బెహరా తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి కటక్‌లో లాంఛనంగా ప్రారంభించిన తరువాత గజపతి జిల్లాలో పర్లాకిమిడి, గుసాని సమితి గారబంద, కాశీనగర్ ఎన్.ఏ.సి.లలో కలెక్టర్ బిజయకుమార్ దాస్, బి.డి.ఓ. గౌరచంద్రపట్నాయిక్, చైర్మన్ ఎస్.వీర్రాజు, ఇతర అధికారులు పాల్గొని ఆయుష్మాన్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం కార్డులు లబ్ధిదారులకు అందజేశారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ఆయుష్మాన్ భారత ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డుల పంపిణీ ప్రారంభమైంది. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లాలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి శాఖ మంత్రి రబి నారాయణ నాయక్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి (నబరంగ్‌పూర్), నర్సింగ్ బోత్ర (జొరిగాం), కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ప్రాథమిక విద్యామంత్రి నిత్యానంద గోండో ఈ కార్డుల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ వీ.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి లు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ పీఎంజే పథకం ప్రారంభసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

ఆరోగ్య పథకాలకు శ్రీకారం

రాయగడ: ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి కటక్‌లో గల బలియాత్ర మైదానంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రజల ఆరోగ్య పథకాలను ప్రారంభించారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, గోపబంధు జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ వయోవందన వంటి పథకాలకు ఆయన పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక రింగ్ రోడ్డు వద్ద గల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఈ మేరకు జరిగిన వర్చువల్ కార్యక్రమంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ పథకాల్లో అంతర్భాగమైన 15 మంది లబ్ధిదారులకు ప్రచార కార్డులు, కాంబో కిట్స్ వంటివి ఆమె పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ఈ పథకాలకు సంబంధించి ప్రచార రథాన్ని ఆమె ప్రారంభించారు.



లబ్ధిదారునికి ఆరోగ్య పథకం కార్డును అందిస్తున్న అధికారులు



ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జనారోగ్య యోజన, గోపబంధు జన ఆరోగ్య యోజన ప్రచార రథాలను ప్రారంభిస్తున్న చైర్మన్ తదితరులు



నబరంగ్‌పూర్‌లో కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి రబి నారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే గౌరీ శంకర్, నర్సింగ్ మజ్జి, కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో



కొరాపుట్‌లో జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి నిత్యానంద, వేదిక మీద కలెక్టర్ వి.కీర్తి వాసన్, చైర్మన్ లలెటెందు రంజన్

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: ప్రభుత్వం పలు ఆరోగ్య పథకాలను ప్రారంభించింది. ఇందులో మల్కన్‌గిరి జిల్లాలో రెండు లక్షల 22వేల మంది లబ్ధి పొందనున్నట్లు ప్రకటించారు. మల్కన్‌గిరి ఎమ్మెల్యే నరసింహ మడ్కామి పద్మగిరి ఆరోగ్య కేంద్రంలో ఈ పథకాన్ని ప్రారంభించగా జిల్లాలోని కటేలిగుడ సమితిలో ఎయిర్ స్ట్రిప్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆషీష్ ఈశ్వర్ పటేల్ ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని గల వివిధ ఆరోగ్య కేంద్రాల్లో ఈ పథకాలను ప్రారంభించారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి



లబ్ధిదారులకు కాంబోకిట్స్‌ను అందిస్తున్న కలెక్టర్ పట్వారి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఈశ్వర్

న్యూస్‌రీల్

ఘనంగా చెన్నపొడ దినోత్సవం



నబరంగ్‌పూర్ లిఫ్ట్ ఇరిగేషన్ కార్యాలయంలో చెన్న పొడ తింటున్న ఉద్యోగులు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో శుక్రవారం చెన్నాపొడ దినోత్సవం ఘనంగా జరిగింది. ఉత్కళ ప్రజలకు ఎంతో ప్రీతిపాత్రమైన మిఠాయి చెన్నా పొడ.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవ జీవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. బియ్యం, నూనె, బంగాళ దుంపలు, ఉప్పు, కందిపప్పు వంటి పది రకాల వస్తువులను ట్రస్టు ద్వారా పంపిణీ చేసినట్లు ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు. ప్రతీ నెల ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ ప్రదీప్ కుమార్

మల్కన్‌గిరి: ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున అన్ని వార్డుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ ప్రదీప్ కుమార్ నాయక్ సూచించారు. బలిమెల మున్సిపల్ కార్యాలయంలో వార్డు సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డుల్లో సమస్యలపై చర్చించారు.

పిడుగు పడి మహిళ మృతి



ఛబి నాయిక్ మృతదేహం వద్ద భర్త అజయ్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కంసారి పుట్ గ్రామంలో గురువారం రాత్రి ఒక ఇంటిపై పిడుగుపడి మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో గురువారం సాయంత్రం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఈ సమయంలో అజయ్ కుమార్ నాయక్ ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంట్లో ఉన్నటువంటి అజయ్ భార్య ఛబి నాయక్(39), వారి కుమారుడు చందన్ నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించగా ఛబి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని పోలీసులకు అప్పగించారు.

21 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున గంజాయితో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బలిమెల - చిత్రకొండ రహదారిపై ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో ఉండడం గమనించారు. వారిని ప్రశ్నించడంతో పాటు బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. దీంతో వీరిని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారించగా ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి చిత్రకొండలో గంజాయి కొన్నట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో అరవింద్, తుఫాన్‌గిరి అనే వ్యక్తులు ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఐఐసీ ధీరజ్ పట్నాయక్ వెల్లడించారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 21 కేజీలు ఉంది. దీని విలువ రూ.2 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు.

• డబ్బులిస్తేనే కదలండి..



నబరంగ్‌పూర్ జిల్లాలో రోడ్డుకి అడ్డంగా తాడు పెట్టిన గిరిజనులు



ఖరీదైన కారు అయితే మాకేంటి చిల్లర ఇచ్చి ముందుకు వెళ్లండి అంటున్న మహిళలు

కొరాపుట్: డబ్బులివ్వందే వాహనాలు వదలబోమని గిరిజన మహిళలు తెగేసి చెబుతున్నారు. చైత్ర పర్వ సందర్భంగా అవిభక్త కొరాపుట్ జిల్లాలలో ఏ రోడ్డు మీద చూసినా ఇదే సంస్కృతి కనిపిస్తోంది. గిరిజనులు తమ సంప్రదాయంలో భాగంగా ప్రతి చోట తాడు గానీ చెట్టు గానీ రోడ్డుకు అడ్డంగా పెడుతున్నారు. తప్పనిసరిగా ఎంతో కొంత చిల్లర ఇస్తే గాని దారి వదలడం లేదు. పైగా ఇది తమ సంప్రదాయమని చెబుతున్నారు. ఆఖరుకు పోలీసు వాహనాలను కూడా వదలడం లేదు.



లమ్తాపుట్ మార్గం లో ఇదే పరిస్థితి

శానిటరీ దుకాణంలో చోరీ



చోరీకి గురైన దుకాణం



సీసీ కెమెరాలో దుండగులు

రాయగడ: స్థానిక కపిలాస్ కూడలిలో గల మహాలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ అనే శానిటరీ దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుకాణం షట్టర్ విరగ్గొట్టి గుర్తు తెలియని నలుగురు దుండగులు లోపలకు ప్రవేశం క్యాష్ కౌంటర్‌లో గల రూ.40వేలు తీసుకెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు జొదారాం చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దుకాణం ముందు సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పర్యటన



అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న అగర్వాల్

రాయగడ: రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్, ప్రభుత్వ కార్యదర్శి అరవింద్ అగర్వాల్ జిల్లాలో పర్యటించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని కైలాస్‌పూర్, కొలనారలో గల ఉన్నత పాఠశాలల్లో పర్యటించి అక్కడ గల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం రామనగుడలో పర్యటించిన ఆయన అక్కడ రైతులు పండిస్తున్న గులాబీ పూల తోటలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమితిలో పసుపు, చింత పండు యూనిట్లను నిర్వహిస్తున్న రైతులతో ముచ్చటించారు. వారికి సరైన ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. అనంతరం రాయగడ అటానమస్ కళాశాలలో పర్యటించిన అగర్వాల్‌కు ప్రిన్సిపాల్ సరస్వతి రే, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

మజ్జిగ వితరణ

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో స్థానిక మహిళా క్లబ్ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. మందిరం ప్రాంగణంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తమ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాల్లో మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టినట్లు, క్లబ్ కార్యదర్శి కస్తూరి సాహు, కోశాధికారి సీహెచ్ ఇతిశ్రీ, అల్కాదాస్, బి.లక్ష్మీలు తెలియజేశారు.

కొనసాగుతున్న చైత్రోత్సవాలు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు



హోమం పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

రాయగడ: పట్టణంలో మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం బారులుతీరారు. మందిరం ప్రాంగణంలోని ప్రత్యేక గదిలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన ఘటాలను దర్శించుకుంటున్నారు. పసుపు, కుంకుమలతో పాటు సీజన్‌లో లభించే మామిడి, పనస తదితర పండ్లను ఘటాల్లో వేసి మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చండీహోమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, పెద్దీన వాసుదేవ రావు, వడ్డాది శ్రీనివాస్‌రావు దంపతులు కూర్చుని పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ చండాహోమం శనివారం రాత్రి పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తుంది. అదేవిధంగా అమ్మవారి ఉత్సవాలు కూడా ముగుస్తాయి. రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక అమ్మవారిని దర్శించుకున్నారు.



హారతి తీసుకుంటున్న భక్తులు

నిప్పులపై పూజారి నడక

ఉత్సవాలు ముగింపులో భాగంగా నిప్పులపై పూజారి నడిచే కార్యక్రమం శనివారం రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. వారి సౌకర్యార్థం కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అదేవిధంగా ముళ్ల కంపలతో అమర్చే ఊయలలో పూజారి ఊగే కార్యక్రమం కూడా శనివారం రాత్రి నిర్వహిస్తారు.

ఘనంగా అలేఖ్ బాబా మందిర ప్రతిష్ట



నూతన మందిరం వద్ద కమిటీ సభ్యులు



రమేష్ మజ్జిని ఆశీర్వదిస్తున్న అలేఖ్ బాబాలు



ప్రతిష్టలో భాగంగా భారీ ఊరేగింపు

కొరాపుట్: అలేఖ్ బాబా పవిత్ర మందిర ప్రతిష్ట ఘనంగా జరిగింది. శుక్రవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి బొడగాంలో కార్యక్రమం జరిగింది. మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పుడు మందిర నిర్మాణానికి నిధులు అందించారు. మందిరం పూర్తయిన సందర్భంగా అలేఖ్ మతస్తులు రమేష్‌కు మేళ తాళాలతో స్వాగతం పలికారు.

వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ శ్రేణుల శోభాయాత్ర



పర్లాకిమిడిలో రామనవమి శోభాయాత్రలో సీతారామ లక్ష్మణులు



పర్లాకిమిడిలో వి.హెచ్.పి. భజరంగ దళ్ ర్యాలీ

పర్లాకిమిడి: పట్టణంలో శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ శ్రేణులు శుక్రవారం సాయంత్రం సరస్వతీ శిశు విద్యామందిర్ నుంచి నగరంలో శోభాయాత్ర నిర్వహించాయి. తొలుత వీహెచ్‌పీ కేంద్రియ సంఘటన్ మంత్రి బినాయక్ రావ్ దేశ్ పాండే, గంజాం, గజపతి ప్రాంతీయ సామాజిక సమరసత్తా నాయకులు తరిణీ దాస్, దేవీ మఠం మహంత రామానంద మహారాజ్ అధ్యక్షతన సాధారణ సమావేశం అనంతరం నగర పరిక్రమ చేశారు. ఈ ర్యాలీలో వేలాది మంది వి.హెచ్.పి., భజరంగ్ దళ్ సభ్యులు కాషాయం జెండాలు, శ్రీరామసీతాసమేత వేషధారణలో పాల్గొన్నారు.

• జనావాసాల్లోకి హైనా



పట్టుబడిన హైనా



హైనాని పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్న సిబ్బంది

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణ సమీపంలోకి హైనా ప్రవేశించింది. బీఎస్ పూర్ సమీపంలో భారత మాల రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతంలో ఒక కల్వర్టు కింద గిరిజనులు హైనాను గుర్తించారు. ముందు రోజు ఏదో వాహనం ఢీకొని ఉండడంతో ఈ క్రూర జంతువు నడవలేకపోతోంది. దీంతో స్థానికులు ఉమ్మర్ కోట్ అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు దాన్ని అదుపు తీసుకోవడానికి ప్రయాస పడ్డారు. అదను చూసి ఎదురు దాడి చేయడం హైనా జంతువు జాతి లక్షణం. దాంతో వల పన్ని ఎంతో కష్టం మీద బోనులో బంధించారు. అనంతరం చికిత్స కోసం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. పపడాహండిలోని అటవీ సంరక్షణ కార్యాలయంలో ఉంచి కోలుకున్న తర్వాత అడవిలోకి విడిచిపెడతామని చెప్పారు. భారత మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా దండకారణ్యం లో వేలాది అటవీ వృక్షాలను తొలగించారు. దీంతో జంతువులు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



నుజ్జయిన బొలెరో వాహనం

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఒడిశా నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న బొలెరో వాహనం టెక్కలి మండలం కె.కొత్తూరు సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరోలో ఉన్న ఒడిశా క్లీనర్ జితేంద్ర సాహు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

విప్లవ పోరాట యోధుడు పైలా



పైలా స్మారక స్థూపం వద్ద విప్లవ జోహార్లు చేస్తున్న ప్రజా సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వర్తమాన భవిష్యత్ విప్లవ పోరాటాలకు నిత్య చలనశీలతను రగిలించే పోరాట యోధుడిగా కామ్రేడ్ పైలా వాసదేవరావు నిలిచారని న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడులో శుక్రవారం పైల వాసదేవరావు వర్ధంతి నిర్వహించారు. పైలా స్మారక స్థూపం వద్ద పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు విప్లవ జోహార్లతో ఘన నివాళులు అర్పించారు. వాసుదేవరావు ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ నెల 13న పలాసలో న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పైలా స్మారక సభ జరుగుతుందని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, ప్రజా సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు ఎం.వినోద్, గౌరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, ఆర్.మాధవరావు, పైల అప్పారావు, కృష్ణ ప్రసాద్, ఎస్.రామారావు, అప్పయ్య, ప్రసాద్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

36 రోజుల తర్వాత స్వగ్రామానికి మృతదేహం



మృతదేహంవద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు



భుజంగరావు(ఫైల్)

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పన భుజంగరావు(43) ఇరాక్‌లో ఉద్యోగానికి వెళ్లి మార్చి 6న ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఎట్టకేలకు మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇరాక్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో నాలుగేళ్లుగా పనిచేస్తున్న భుజంగరావు అమ్మోనియా ట్యాంకర్ సమీపంలో పేలుడు కారణంగా మృతిచెందిన విషయం తెలిసిందే. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్ చొరవతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. భుజంగరావు మృతదేహాన్ని చూసిన తల్లి దమయంతి, భార్య జయలక్ష్మి, కుమార్తెలు రిషీ, దీక్ష కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉద్యోగిని దూషించిన కేసులో రెండేళ్ల జైలుశిక్ష

రణస్థలం : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిని దూషించిన కేసులో బలగ చిరంజీవి అనే వ్యక్తికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రెండేళ్ల జైలు శిక్ష, రూ.11వేలు అపరాధ రుసుం విధిస్తూ తీర్పు వెలువడిందని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. 2020 డిసెంబర్ 4న రణస్థలం మండలం తెప్పలవలసలో వీఆర్‌ఓ పేదలందరికి ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు హద్దురాళ్లు తీసేశారు. సమాచారం అందిన వెంటనే సచివాలయ సిబ్బంది, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో బలగ బుచ్చిబాబు, బలగ శ్రీను, మహేష్, రమణ, చిరంజీవి, యాగాటి లక్ష్మణరావు, భోగాపురపు సింహాచలం, ముక్కు అసిరయ్య, బంగారపు సూరప్పడులు హద్దురాళ్లు తొలగించినట్లు గుర్తించారు. ఈ విషయమై తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చే సమయంలో వీఆర్‌ఓను బలగ చిరంజీవి అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడు. దీంతో బాధిత వీఆర్‌ఓ జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ఎం.మహేంద్ర కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం నిరూపితం కావడంతో చిరంజీవికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పునిచ్చింది.

గ్రామీణ కళాకారులకు చేయూత నివ్వాలి



నాటకాల గురువు చిత్త రంజన్ బిషోయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దేవదాస్ మహాంకుడో



కొరాపుట్‌లో గ్రామీణ కళాకారులను సత్కరిస్తున్న అధికారులు



గిరిజన కళాకారులను సత్కరిస్తూ..



లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రవిత్ర శాంతకు స్వాగతం పలుకుతున్న కళాకారులు



నందాహండిలో గిరిజన కళాకారుల ప్రదర్శన

కొరాపుట్: గ్రామీణ కళాకారులకు సమాజంలో ప్రతివ్యక్తి చేయుత నివ్వాలని లక్ష్మీపూర్ ఎంఎల్‌ఏ పవిత్ర శాంత అన్నారు. లక్ష్మీపూర్ సమితి గౌడగుడ గ్రామ పంచాయతీ ఖజురిపుట్ గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ కళాకారులను చేయత నిచ్చేందుకు అనేక పథకాలు వచ్చాయన్నారు. అంతకుముందు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఎంఎల్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారులను సత్కరించారు. మరో వైపు జిల్లా అధికార యంత్రాంగం అదేశాల మేరకు ప్రతి సమితి కేంద్రంలో గిరిజన కళాకారులను అధికారులు సత్కరించారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి బి.మాలిగుడ గ్రామంలో ఫ్లోక్ కళాకారులను అధికారుల సత్కరించారు. గ్రామీణ గిరిజన నాటకాల గురువు దివంగత చిత్త రంజన్ బిసోయి విగ్రహానికి సీనియర్ కళాకారులు దేవదాస్ మహాంకుడో నివాళులర్పించారు.

విక్రమ వర్సిటీని సందర్శించిన విద్యాశాఖ కార్యదర్శి



అధికారులతో చర్చిస్తున్న ఉన్నత విద్యా విభాగ కార్యదర్శి అరవింద అగర్వాల్

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా విభాగ కార్యదర్శి అరవింద అగర్వాల్ గురువారం సాయంత్రం సందర్శించారు. వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు జిల్లా కలక్టర్ మొదలగు వారితో రెండేళ్ల కిందట ప్రారంభించబడిన విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో సౌకర్యాలు, సమస్యలపై చర్చించారు. కొరాపుట్ జిల్లాలో ఉన్నత విద్య వికాశ లక్ష్యంతో విక్రమదేవ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా గుర్తింపు ఇచ్చి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే నేటికీ కళాశాల భవనాల్లోనే కళాశాల అధ్యాపకుల చేతనే వర్సిటీని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, కులపతి ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ మిశ్ర, రిజిస్ట్రార్ మహేశ్వర చంద్ర నాయిక్, ఉన్నత విద్యాపరిషత్ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ హల్దార్, విక్రమదేవ్, ఉన్నత విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ పాత్రో, మహేశ్వర దురియ, డాక్టర్ అరుణ కుమార్ రాజ్, డాక్టర్ విజయ కుమార్ సెట్టి, లంభోదర మఝి, కమల లోచన మహలిక, ఫ్రాన్సిస్ బర్ల, డాక్టర్ సాగరికమిశ్ర, డాక్టర్ దేవదత్త ఇందోరియ పాల్గొన్నారు.

14న హిందూ ఏక్తా వాహినీ ర్యాలీ



మాట్లాడుతున్న గౌరీ శంకర్ సాహు తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ హిందూ ఏక్తా వాహినీ ఆధ్వర్యంలో సుమారు 30 వేల మందితో ఈనెల 14న భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ గౌరీ శంకర్ సాహు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక రాజువీధిలోని గణేష్ దేవాలయంలో జరిగిన మీడియా సమావేశం ఈ విషయాన్ని వెల్లడించారు. పాణ సంక్రాంతి, హనుమన్ జయంతి, మహా బిషు సంక్రాంతి, ఒడియా నూతన సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆ రోజున మెయిన్ రోడ్డులో చమిరియా గుడ వద్ద సాయంత్రం మూడు గంటలకు ర్యాలీ ప్రారంభమై పోలీస్ గ్రౌండ్స్ వరకు కొనసాగుతోందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పూసర్ల సంతోష్, అనంత పండా, నీలి బాబు త్రిపాఠి, బాబు యాదవ్, సిసిర్ గంతాయిత్ ఉన్నరు.

ముగిసిన మహావీర్ విగ్రహ ప్రతిష్ట ఉత్సవం



సిద్ధి మహావీర్ విగ్రహం

జయపురం: జయపురం సమితి గగణాపూర్ సేవా పేపరుమిల్లు సమీప డుమురిగుడ గ్రామంలో సిద్ధ మహావీర్ విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఉత్సవాలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. మూడు దినాలు అంగరంగ వైభవంగా జరిగిన ప్రతిష్టా ఉత్సవాలలో 15 అడుగుల ఎత్తుగల సిద్ధ మహావీర్ వేడుకల్లో పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మహావీర్ కమిటీ ద్వారా ప్రతిష్ఠించబడిన సిద్ధి మహావీర్ ప్రతిమను గగణాపూర్ నివాసీ సునీల్ సాహు సొంత ఖర్చుతో తయారు చేయించారని కమిటీ వెల్లడించింది.

భక్తిశ్రద్ధలతో సీతాదేవికి కుంకుమ పూజలు



సీతాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు



పుష్పార్చణ పూజలు చేస్తూ..



తరలివచ్చిన మహిళలు

జయపురం: జయపురం జమాల్ లైన్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో చతుర్థి సందర్భంగా సీతాదేవికి శుక్రవారం ఘనంగా పూజలు జరిపారు. ఉదయం 9.30 గంటలకు వందలాది మంది మహిళలు, యువతులు సీతా దేవికి సామూహిక లలితా సహస్ర నామములతో 'కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామములతో పుష్ప అర్చన జరిపారు. ఆలయ పూజారి ఉలిమిరి నాగేశ్వరరావు పంతులు శాస్త్రోత్తంగా మహిళలచే పూజలు చేయించారు. కార్యక్రమంలో శ్రీరామమందిర ఆలయ కమిటీ అధ్యక్షులు గోరపల్లి నాగరాజు, కార్యదర్శి సాన జగదీష్, సహాయ కార్యదర్శి ఎస్.చంద్ర శేఖర్, కోశాధికారి వారణాశి రమేష్ గుప్త, సహాయ కోశాధికారి బి.వెంకట రమణ, ఉపాధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, అందవరపు తిరుమల, ఎన్.మల్లికార్జున, వారణాశి సత్యనారాయణ, వారణాశి శివప్రసాద్, ఎన్.ఈశ్వర రావు పాల్గొన్నారు.

ట్యాక్సీ కార్మికుల ఆందోళన



పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న ట్యాక్సీ స్టాండ్ కార్మికులు

టెక్కలి: టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో ట్యాక్సీ స్టాండ్ తొలగింపును వ్యతిరేకిస్తూ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పట్టుమహాదేవి కోనేరు గట్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో ట్యాక్సీ స్టాండ్ తొలగింపు కోసం అధికార యంత్రాంగం సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పంచాయతీ అధికారులు యంత్రాలతో సహా ట్యాక్సీ స్టాండ్ వద్దకు చేరుకున్నారు. దీంతో ట్యాక్సీ కార్మికులు అడ్డుకుని వ్యతిరేకించారు. తమకు ప్రత్యామ్నాయం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, ఇప్పుడు హఠాత్తుగా వచ్చి స్టాండ్ తొలగిస్తామనడం సమంజసం కాదని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాము, సిబ్బంది ట్యాక్సీ స్టాండ్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తామంతా మంత్రిని కలిసి సమస్య వివరిస్తామని, ఆ తరువాత స్టాండ్ తొలగింపు నిర్ణయం తీసుకోవాలని కార్మికులు పట్టుబట్టడంతో అధికారులు వెనుదిరిగారు. కాగా, దశాబ్దాలుగా ఇదే స్థలంలో ట్యాక్సీ స్టాండ్ ద్వారా కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఇప్పుడు స్టాండ్ తొలగిస్తే కుటుంబాలతో సహా ఇబ్బందులు పడతామని పలువురు కార్మికులు వాపోయారు.

ఆదిత్యుని సన్నిధిలో దత్త విజయానందతీర్థ స్వామి



అనివెట్టి మండపంలో విజయానంద తీర్థ స్వామీజీ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శ్రీదత్త విజయానంద తీర్థ స్వామీజీ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయంగా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా అనివెట్టి మండపంలో స్వామీజీ మాట్లాడుతూ విశ్వలోకాల రక్షకుడు, ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి ఇక్కడ కొలువుతీరడం నిజంగా అదృష్టమని..ఆరోగ్య ప్రదాత సూర్యభగవానుడని వివరించారు. ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) జరుగుతున్నాయని ప్రధానార్చకులు శంకరశర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పి లి సాందీప్ శర్మ, ఫణీంద్ర శర్మ పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



తలకొరివి పెడుతున్న నాగమ్మ

కంచిలి: మండలంలోని చిన్నకొజ్జిరియా గ్రామానికి చెందిన పొందల జగన్మోహిని(75) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా కుమార్తె నాగమ్మ తలకొరివి పెట్టింది. కుమారుడు శివాజీ బెంగళూరులో జీవనోపాధి పొందుతున్నాడు. దీంతో అవివాహితురాలైన కుమార్తె నాగమ్మ హాజరై అంత్యక్రియలు పూర్తి చేసింది.

తనిఖీలకు రమ్మన్నారు.. వస్తే పొమ్మన్నారు..



ఆమదాలవలస సీహెచ్‌సీ వద్ద దివ్యాంగులు

ఆమదాలవలస: వికలాంగత్వం పునఃపరిశీలన కోసం ఆమదావలసలోని జొన్నవలస సీహెచ్‌సీకి ఈ నెల 11న హాజరుకావాలంటూ నందిగాం మండలం హరిదాసుపురం సచివాలయం పరిధిలోని పలువురు దివ్యాంగ పింఛనుదారులకు ఈ నెల 1న ఉత్తర్వులు అందించారు. దీంతో హరిదాసుపురం గ్రామానికి చెందిన బమ్మిడి సావిత్రి, గుంట హేమాచలం, నర్సిపురం నారాయణ, చెరుకుపల్లికి చెందిన మామిడి సంతు, రాజాం చంద్రయ్య, ప్రతాప విశ్వనాథపురం గ్రామానికి చెందిన పనిల రామస్వామిలు తీవ్ర వ్యయ ప్రయాసలకు ఓర్చి, మండుటెండలో ప్రయాణించి శుక్రవారం ఆమదాలవలసలోని ఆస్పత్రికి చేరుకున్నారు. అయితే సిబ్బంది మాత్రం ఇక్కడ ఎటువంటి వికలాంగత్వ పరీక్షలు చేపట్టలేదని, మీ వద్ద ఉన్న ఉత్తర్వులతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. దీంతో దివ్యాంగులు ఉసూరుమన్నారు. తమకు ఉసురు అధికారులకు, ప్రభుత్వానికి తప్పక తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. తమకు ఇటువంటి పరిస్థితి తీసుకొచ్చిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంతసేపయ్యాక, వీరి ఆవేదనను చూసిన ఆస్పత్రి సిబ్బంది పాతపట్నం సీహెచ్‌సీకి వెళ్లమని చెప్పి అక్కడి సిబ్బందితో ఫోన్‌లో పునః పరిశీలన చేయించారు.

జీడిమామిడి.. తగ్గిన దిగుబడి

- ఉద్దాన ప్రాంత రైతుల్లో అలజడి
- 38,930 ఎకరాల్లో చీడపీడల బెడద
- అకాల వర్షంతో మరింత నష్టం
- పెట్టుబడులు కూడా రావడం లేదని రైతుల ఆవేదన



వజ్రపుకొత్తూరు ప్రాంతంలో నల్లగా మాడి పిందె దశలోనే ఉన్న జీడి పంట

వజ్రపుకొత్తూరు:

వాతావరణంలోని అసమానతలు, వేసవి వచ్చాక కూడా దట్టంగా కురిసిన మంచు, చీడపీడలు, ఇటీవల కురిసిన అకాల వర్షం ఈ ఏడాది జీడిమామిడి రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఎకరాకు కనీసం ఐదు బస్తాలు (బస్తాకు 80 కిలోలు) దిగుబడి ఆశించిన రైతులు ప్రస్తుతానికి ఒకటి రెండు బస్తాలతో సరిపెట్టుకుంటున్నారు. ఇంత దారుణమైన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షాలు కురవగానే తోటల్లో ఆకులు, పిచ్చి మొక్కల తొలగింపు, దుక్కులు దున్ని చెట్టు మొదల్లో రసాయన ఎరువులు వేయడానికి ఎకరాకు సుమారు రూ.25 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఇప్పుడు రెండు బస్తాలు దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇళ్లల్లో శుభ కార్యాలు చేయాలంటే రెండు ఎకరాలు జీడిమాడి తోట ఉంటే చాలు ఖర్చులకు వెనుకాడనవసరం లేకుండా ఉండేదని, ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెబుతున్నారు. చేసిన అప్పులు ఏటా పెరిగిపోతూ ఆదాయం లేక అప్పులు పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

అవగాహన కరువై..

జీడి మామిడి పంట పూత, పిందె దశలో ఉండగా తోటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుత పూత నల్లగా మాడిపోవడం, పిందె పెరగకపోవడం, పిండి నల్లి తెగులు కారణంగా జీడిపండు పిక్కకు బూజు సోకడం, దోమపోటు కారణంగా చెట్టు మొత్తం ఎండిపోయి పాడైపోవడం వంటి పరిణామాలు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ,



కొమరల్తాడలో జీడి పంటకు తెగులు సోకడంతో ఎండిపోయిన పూత

కొత్తపేట, అమలపాడు, యూఆర్‌కేపురంతో పాటు పలాస, సీతంపేట, కవిటి, కంచిలి, మందస, రణస్థలం ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం ఉంది. ఏ మందు ఎంత మోతాదులో వాడితే మంచి ఫలితం ఉంటుందో ఉద్యానవన శాఖ అధికారులు తమకు అవగాహన కల్పించడం లేదని కొందరు రైతులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే జరగాలి. కానీ ఉద్దానం ప్రాంతంలో ఉద్యానవన శాఖ ద్వారా జీడిమామిడి రైతులకు సలహాలు సూచనలు మొక్కుబడిగా ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదు మండలాలకు ఒకే ఒక్క ఉద్యానవన శాఖ అధికారి ఉండటం వల్ల కూడా రైతులకు సలహాలు, సూచనలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సీజన్‌లో రైతులకు చేరువగా, పంటను కాపాడేందుకు ఉండాల్సిన విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు చాలా మంది సచివాలయాలకే పరిమితమవుతున్నారని జీడిమామిడి రైతులు వాపోతున్నారు. దీంతో చాలామంది రసాయన మందులపై అవగాహన లేక ఇష్టానుసారంగా పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల తోటల్లో పూత మాడిపోయి పిందె రాకుండా పోయిందని రైతులు చెబుతున్నారు.

దెబ్బకొట్టిన వర్షాభావం..

జిల్లాలో దాదాపు రెండున్నర నెలలుగా వర్షం కురవకపోవడం, అకాల వర్షం ప్రభావం జీడి మామిడి పంటపై పడిందని రైతులు చెబుతున్నారు. జీడిమామిడి తోటలకు నీరు పెడితే మంచి కాపు ఇస్తుందని ఉద్యానవన శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ప్రస్తుతం జీడిమామిడి తోటలు అధికంగా ఉద్దానం, కొండపోడు భూములు, రాళ్ల ప్రదేశాల్లో సాగు చేస్తున్నారు. ఈ తరహా తోటలకు నీరు అందే అవకాశం ఏమాత్రం లేకపోవడం కూడా జీడిమామిడి పంటల దిగుబడి తగ్గిపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. వరుసగా మూడేళ్లుగా పంట నష్టం వాటిల్లడంతో, ఇక జీడిమామిడి తోట సాగు వృథా అనే నిర్ణయానికి వచ్చిన రైతులు చాలా తోటలను నరికి కలపగా విక్రయిస్తున్నారు. జిల్లాలో దాదాపు 38,930 ఎకరాల్లో జీడి మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇటీవల చెట్లు జీర్ణావస్థకు వచ్చి మరికొన్ని చోట్ల తోటలను నరికివేయడం వల్ల జీడిమామాడి తోటల విస్తీర్ణం జిల్లాలో 10 వేల ఎకరాలకు పడిపోయిందని పలువురు చెబుతున్నారు.

ధరల పతనం..

జిల్లాలో వజ్రపుకొత్తూరు మండలంలో 11706, మందసలో 8069, పలాసలో 4575, రణస్థలంలో 1720, సోంపేటలో 1950, కంచిలిలో 1173, సీతంపేటలో 6539, కవిటిలో 1270, ఎచ్చెర్లలో 1935 ఎకరాల్లో రైతులు జీడిమామిడి పంట సాగు చేస్తున్నారు. గత రెండు వారాల్లో జీడి మామిడి ధర రోజు రోజుకూ తగ్గుతూ వస్తోంది. సీజన్ తొలి రోజుల్లో (బస్తా 80 కిలోలు) రూ.14000 పలకగా.. ప్రస్తుతం రూ.12వేలు (కిలోరూ.150)కు పడిపోయింది. అసలే పంట దిగుబడి లేక దిగాలు పడ్డ రైతులు ధర కూడా తగ్గిపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జీడి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆశలు ఆవిరి..



జీడి పంటపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ఎకరాకు ఆరు బస్తాలు దిగుడి వస్తుందని భావించాం. వాతావరణంలో మార్పులతో పిందె మాడిపోయి పిక్కలకు బూజు పట్టి దిగుబడిపై ప్రభావం చూపింది. ఎకరాకు ఒక బస్తా కూడా రాని పరిస్థితి వచ్చింది.

– దున్న నాగేశ్వరరావు, యూఆర్‌కేపురం, వజ్రపుకొత్తూరు మండలం

శాస్త్రవేత్తలను తెచ్చాం



వజ్రపుకొత్తూరు పూండి ఉద్దానం ప్రాంతంలో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు పెద్దపేట, జీడిపరిశోధన కేంద్రం(బాపట్ల) నుంచి శాస్త్రవేత్తలను తెప్పించి రైతులకు అవగాహన కల్పించాం. ఐదు మండలాలకు ఉద్యానవన శాఖ అధికారిగా ఉన్నాను. వాతావరణంలో మార్పులకు ఎవరూ ఏమీ చేయలేరు.పిండి నల్లి ఉద్ధృతంగా ఉండటం వల్ల రైతులకు నష్టం వాటిల్లింది. మందులు ఏం వాడాలో రైతులకు వివరించాం. – కె.సునీత, ఉద్యానవన శాఖ అధికారి

క్లుప్తంగా

అట్రాసిటి కేసుపై డీఎస్పీ విచారణ

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామంలో అట్రాసిటి కేసుపై విజయనగరం డీటీసీ డీఎస్పీ పి.వీరకుమార్ శుక్రవారం విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన జి.కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై బి.దేవిపై నమోదైన కేసులో డీఎస్పీ గ్రామంలోని ఎస్సీ కాలనీలోను, పాన్‌షాపు వద్ద సాక్షులు, ఫిర్యాదుదారులను విచారణ చేసి వివరాలను నమోదు చేసుకున్నారు. డీఎస్పీతో పాటు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు విచారణలో పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితుడిని అదుపులోకి తీసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్‌గణేష్, చిత్రంలో నిందితుడు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఆరు కేజీల గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి ఓ వ్యక్తి ట్రైన్‌లో గంజాయితో వచ్చి స్టేషన్‌లో దిగాడన్న పక్కా సమాచారంతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రామ్‌గణేష్‌లు హుటాహుటిన స్టేషన్‌కు వెళ్లి రిజర్వేషన్ కౌంటర్ పక్కనే ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా, అనుగూరు పంచాయతీ పరిధి, లాటింగ్‌కు చెందిన 32 ఏళ్ల రమాకాంత్ బెహరాను అదుపులోకి తీసుకుని ఆ వ్యక్తి దగ్గర ఉన్న ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసును నమోదు చేసి కోర్టులో హాజరు పరచడంతో న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

870 లీటర్ల సారా పట్టివేత

- నలుగురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, బెల్లం ఊటలు

సీతంపేట: మండలంలోని సుందరయ్యగూడ ప్రాంతంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఏఈఎస్ ఏఎస్ దొర ఆధ్వర్యంలో సారా బట్టీలపై శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 870 లీటర్ల సారా పట్టుకున్నారు. సారా వండడానికి సిద్ధం చేసిన 1250 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఏఈఎస్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి పూయక మురళి, బిడ్డిక ఆదినారాయణ, వి.సంజీవరావులతో పాటు నల్లబెల్లం సరఫరా చేసిన లబ్బుకు చెందిన జాన్ సురేష్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. సారా వండినా, విక్రయించినా, అక్రమరవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మొబైల్ పార్టీ టీమ్ మురళి, కొత్తూరు సీఐ కిరణ్మయి, పాలకొండ ఎస్సైలు ఫణీంద్రబాబు, ఎల్.తిరుపతిరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వేగం

- బైక్‌పై నేపాల్ వెళ్తూ ప్రమాదానికి గురైన దంపతులు
- సీహెచ్ అగ్రహారం వంతెనపై ప్రమాదం
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన నాగసత్యలక్ష్మి

పూసపాటిరేగ: మితిమీరిన వేగం భార్య ప్రాణాలు తీయగా, భర్తను క్షతగాత్రుడిని చేసింది. బైక్‌పై నేపాల్ వెళ్తున్న రాజమండ్రికి చెందిన దంపతులు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారం ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రికి చెందిన నంబూరి నాగసత్య లక్ష్మి, భార్గవరాజు దంపతులు కోయంబత్తూర్‌లోని ఈషా యోగా కేంద్రంలో పనిచేస్తున్నారు. ఇటీవల సొంతూరు రాజమండ్రికి వచ్చారు. నేపాల్ పర్యటన కోసం ఉదయం 6 గంటలకు రాజమండ్రిలో బయలుదేరారు. 10.30 గంటలకు బైక్ అదుపుతప్పి సీహెచ్ అగ్రహారం ఫ్లై ఓవర్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో బైక్ వేగం అధికంగా ఉండడంతో వంద మీటర్ల వరకు ఇద్దరినీ ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో నాగ సత్య లక్ష్మి అక్కడకక్కడే ప్రాణాలు విడవగా, భార్గవరాజుకు తీవ్రగాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. పూసపాటిరేగ ఎస్‌ఐ ఐ.దుర్గాప్రసాద్ కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా అభ్యున్నతికి పూలే కృషి

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ఐలు రాంబాబు పాల్గొన్నారు.

పగలు, రాత్రి తేడా లేకుండా..!

- అనధికార విద్యుత్ కోతలు
- ఎండ వేడిమికి ఇబ్బంది పడుతున్న జనం
- ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేత



అయ్యన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో అనధికారిక విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎండవేడిమితో పాటు ఉక్కబోతను భరించలేక అవస్థలు పడుతున్నారు. ఫ్యాన్ కింద సేదతీరుదాం అంటే విద్యుత్ కోతల వల్ల ప్రజలకు అవకాశం లేని పరిస్థితి. కొద్దిమందికి మాత్రమే ఇన్వర్టర్స్ ఉన్నాయి. ఇన్వర్టర్స్ లేని పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ కోతలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా విధిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 10, 15 నిమిషాల పాటు పదేపదే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో 20 నుంచి 30 నిమిషాల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇస్తాం. విద్యుత్ కోతలే ఉండవు, చార్జీలు కూడా పెంచబోమని కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రకటనలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కన పెట్టేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఇవ్వాల్సిన సమయంలోనూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పవర్‌కట్ అని కాకుండా రకరకాల కారణాలతో విద్యుత్ కోతలు విధిస్తున్నారు. అధికారికంగా కాకుండా అనధికారికంగా ఇష్టానుసారం కోతలు పెడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

రైతులకు తప్పని ఇబ్బందులు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆకాశంలో చిన్నపాటి మబ్బు వేసినా వ్యవసాయ విద్యుత్‌కు సరఫరా నిలిపివేస్తున్నారు. ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాల్లో పదేపదే విద్యుత్ నిలిపివేయడం వల్ల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ద్వారా పంటలకు సాగునీరు అందించే రైతులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. రోజులో నాలుగు, ఐదుసార్లు అనధికారికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల విద్యుత్ ఎప్పుడువస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు నిరంతరాయంగా 9గంటల పాటు విద్యుత్ అందేది. గృహ వినియోగదారులకు కూడా 24 గంటల పాటు విద్యుత్ అందేది. అత్యవసరంగా విద్యుత్ కోత విధించాల్సి వస్తే అధికారికంగా ప్రకటించేవారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు 7,41,828

జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు 7, 41, 828 ఉన్నాయి. వాటిలో కేటగిరి-1 కి సంబంధించి 6,04,535, కేటగిరి-2 కనెక్షన్లు 65, 194 ఉన్నాయి. కేటగిరి-3 కనెక్షన్లు 2,822 ఉన్నాయి. కేటగిరి -4 కనెక్షన్లు 14,168, కేటగిరి-5 కనెక్షన్లు 55,109 ఉన్నాయి.

ప్రతిరోజూ విద్యుత్ సరఫరా నిలిపివేత



ప్రతిరోజూ పగలు లేదా రాత్రి పూట 10, నుంచి 15 నిమిషాల పాటు 2,3 పర్యాయాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. వేసవికాలం కావడంతో పగలు, రాత్రి కూడా ఉక్కబోత కారణంగా ఉండలేకపోతున్నాం. ఫ్యాన్ కిందికి వెళ్దామంటే విద్యుత్ సరఫరా ఉండడం లేదు.

ఆర్. నాగేశ్వరావు, వినియోగదారు, పెదవేమలి గ్రామం గంట్యాడ మండలం

విద్యుత్ కోతలు లేవు

అధికారికంగా ఎక్కడా విద్యుత్ కోతలు విధించడం లేదు. ఎండవేడిమికి కొన్ని చోట్ల ట్రిప్ అవడం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. రాత్రివేళ ఎక్కడైనా సమస్య తలెత్తితే విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం. ఎక్కడ సమస్య వచ్చినా విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి చర్యలు తీసుకుంటున్నారు.

ముప్పల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

1110 కేజీల నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి సీజ్



కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేస్తున్న నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి

విజయనగరం: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై ఆకస్మిక దాడులు నిర్వహించిన ప్రజారోగ్య సిబ్బంది 1110 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, తన బృందంతో కలిసి నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం కన్యకా పరమేశ్వరి ఆలయం సమీపంలో ఉన్న ప్లాస్టిక్ దుకాణాల వద్దకు వెళ్లి నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలను గుర్తించి మొత్తం 1,110 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని విశాఖ జిల్లా మధురవాడలో ఉన్న జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో తాము కృషి చేస్తున్నప్పటికీ కొందరు వ్యాపారస్తులు అనధికారికంగా ప్లాస్టిక్ విక్రయాలను సాగిస్తున్నారన్నారు. ఎన్నోసార్లు హెచ్చరించినప్పటికీ బేఖాతరు చేస్తూ ప్లాస్టిక్‌ను విక్రయిస్తూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తున్నారన్నారు. ఇక నుంచి నిరంతరం దాడులు నిర్వహించి ప్లాస్టిక్ అమ్మకాలను నియంత్రిస్తామని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ప్లాస్టిక్ వినిమయం జరగకుండా పూలు, కూరగాయల దుకాణాలు ఇతరత్రా చిన్నచిన్న దుకాణాల వద్దకు వెళ్లి తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. అయితే కొంతమంది నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ అమ్మకాలు సాగించడంతో నగరంలో ప్లాస్టిక్ వినిమియం జరుగుతున్నట్లుగా గుర్తించామన్నారు. దీంతో ఆకస్మిక దాడులు చేపట్టాలని ఆదేశించడంతో 1110 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని, ఎనర్జీ ప్లాంట్ కు తరలించామన్నారు. ఇక నుంచి ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ ను విక్రయించినట్లు గుర్తిస్తే సరుకును స్వాధీనం చేసుకోవడంతో పాటు, భారీగా అపరాధ రుసుము విధించి, దుకాణాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు, రవిశేఖర్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ సేవాసంఘం ప్రచార క్యాదర్శిగా జీవీ శ్రీనివాస్



మాట్లాడుతున్న రాష్ట్ర బ్రాహ్మణసేవా సంఘం ప్రచార కార్యదర్శి జీవీ శ్రీనివాస్

సీతానగరం: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సీతానగరం మండలకేంద్రానికి చెందిన గన్నవరపు వెంకట శ్రీనివాస్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనూరు సతీష్‌శర్మ, హెచ్‌కే మనోహర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం నూతనంగా నియమితులైన రాష్ట్ర ప్రచారకార్యదర్శి గన్నవరపు వెంకట శ్రీనివాస్ మండలకేంద్రంలో మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్యను రాష్ట్రవ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరిస్తానని తెలియజేశారు. ఆయన ఎంపిక పట్ల ఉమ్మడి జిల్లా బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి వెల్ఫేర్ డే



వెల్ఫేర్ డే లో ఎస్పీకి విజ్ఞాపనలను అందజేస్తున్న సిబ్బంది

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం వెల్ఫేడ్ డే ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు డీపీఓలో 'వెల్ఫేర్ డే'ను ఎస్పీ నిర్వహించి మాట్లాడుతూ సిబ్బంది ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలను విజ్ఞాపనల రూపంలో ఈ వెల్ఫేర్ డే ద్వారా తీసుకుంటున్నట్లు చెప్పారు. వారి సమస్యలు,సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తన చాంబర్‌కు వచ్చిన సిబ్బందిని ప్రత్యేకంగా పిలిపించి వారి సమస్యలను సావధానంగా ఎస్పీ ఆలకించారు. సిబ్బంది చెప్పిన సమస్యలను వారి ముందే ఓ నోట్ బుక్‌లో నోట్ చేసుకున్నారు. వెంటనే అక్కడిక్కడే సూపరింటెండెంట్‌ను తన చాంబర్‌కు పిలిపించుకుని సిబ్బంది ఇచ్చిన విజ్ఞాపనలకు తగిన వివరణలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా సిబ్బంది సమస్యలకు పరిష్కారానికి తగిన చర్యలు చేపడతానని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. మొత్తం ఆరుగురు సిబ్బంది వారి సమస్యలను వెల్ఫేర్‌డేలో ఎస్పీకి విన్నవించుకున్నారు.

డ్రోన్ల వినియోగంలో సెంచూరియన్ సహకరించాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వ్యవసాయం, ఉద్యాన వనాల అభివృద్ధిలో డ్రోన్ల వినియోగానికి సహకరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం సెంచూరియన్ వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజుతో కలెక్టర్ భేటీ అయ్యారు. సెంచూరియన్ యూనివర్సిటీలో చేపడుతున్న కోర్సుల వివరాలను, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ గురించి కలెక్టర్‌కు చాన్స్‌లర్ వివరించారు. యువతకు నైపుణ్యం ఇవ్వడానికి తాము సిద్ధంతా ఉన్నాయని చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్‌రాజు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో అమలు చేస్తున్న కోర్సులు, నైపుణ్య శిక్షణలు, సీడాప్ ఒప్పందం గురించి వివరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ త్వరలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా యువతకు నైపుణ్య కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే డ్రోన్లతో వ్యవసాయం ఇతర రకాల సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. దీనికి కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ స్పందిస్తూ తాను త్వరలో విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తానని చెప్పారు. వ్యవసాయంలో ప్రస్తుతం మామిడి పంట ఉన్నందున తెగుళ్ల నివారణకు డ్రోన్ల ద్వారా కృషి చేయాలని కోరారు.

సురక్షిత ప్రసవాలే లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: మాతా, శిశు ఆరోగ్య శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆశా నోడల్ అధికారులతో ఎన్జీఓ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ భాస్కరరావు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. మాతా, శిశు ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని, గర్భిణిగా నమోదు చేసినప్పటి నుంచి ప్రసవానంతరం వరకు పూర్తిస్థాయిలో ఆరోగ్య తనిఖీలు, వైద్యపరీక్షలు, నెల వ్యవధిలో రెండు డోసుల టిడి ఇంజక్షన్, ప్రతిరోజూ ఐరన్, కాల్షియం మాత్రలు, నిర్దేశించిన కాల వ్యవధిలో కనీసం నాలుగు తనిఖీలు తప్పనిసరి అని తెలిపారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు సత్వరమే గుర్తించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని, సురక్షిత ప్రసవమే ధ్యేయంగా కృషి చేయాలని కోరారు. సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీల్లో జరిగేలా చూడాలని చెప్పారు. గిరిశిఖర, మారుమూల గిరిజన గ్రామాల్లో గర్భిణులను నెల/రెండు నెలలు ముందుగానే వసతి గహాల్లో చేర్చాలని సూచించారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయడం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేలా పర్యవేక్షించాలని సూచించారు. వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆశ కార్యకర్తలకు ఆరోగ్యశాఖ పంపిణీ చేసిన యూనిఫాంను ప్రోగ్రాం అధికారులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో డీఐఓ డా.ఎం.నారాయణరావు,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా.రఘుకుమార్, డీపీహెచ్ ఎన్ఓ ఉషారాణి, డీపీఓ లీలారాణి, డీసీఎం విజయలత, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బాసంగిలో ఏనుగుల గుంపు



బాసంగి రహదారిపై ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి పంటపొలాల్లో ఏనుగులు శుక్రవారం దర్శనమిచ్చాయి. ఉదయం వెంకటరాజ పురంలోని వరిపంటను ధ్వంసం చేసి సాయంత్రానికి బాసంగి పరిసర ప్రాంతాల్లోకి జారుకున్నాయి. రాత్రి సమయాన గ్రామంలోకి ఏనుగులు చొచ్చుకురావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. వరిపంట మరో 20 రోజుల్లో కోతకు వస్తుందని పంటను ధ్వంసం చేస్తే పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పీఎంశ్రీ రాష్ట్ర బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న పీఎంశ్రీ రాష్ట్ర బృందం సభ్యులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో పీఎంశ్రీ పథకం రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ ఎస్.ప్రసాద్, జి.మహేశ్వర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సహాయకులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వారు మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద మన్యం జిల్లాలో 19 పాఠశాలలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలో మౌలిక వసతులు, క్రీడామైదానం, ల్యాబ్‌లు, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ఆ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ 19 పాఠశాలలు మోడల్ పాఠశాలలుగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. నిర్మాణ, అభివృద్ధి పనులన్నీ సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ అధికారుల సహకారం, సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ పనులను సకాలంలో పూర్తి చేస్తే మరిన్ని నిధులు జిల్లాకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం పనులు జరుగుతున్న తీరు, సమస్యలను 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.రమాజ్యోతి, సమగ్ర శిక్ష అదనపు సమన్వయ కర్త ఆర్.తేజేశ్వరరావు, ఇంజినీరింగ్ సహాయకులు, సెక్టోరల్ సిబ్బంది 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అటకెక్కుతున్న ఇటుక

- పడిపోయిన విక్రయాలు
- ముందుకు సాగని పరిశ్రమ



సంతకవిటి మండలం తాలాడలో ఇటుకలవ్యాపారం లేక ఖాళీచేసి వెళ్లిపోయిన వ్యాపారులు

రాజాం: మట్టి ఇటుకల తయారీ పరిశ్రమ గతేడాది వరకూ మూడు ఇటుకలు ఆరు బట్టీలు అన్న చందంగా నడిచింది. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో పుట్టగొడుగుల్లా ఇటుక పరిశ్రమలు పుట్టుకొచ్చేవి. ఒక్కో బట్టీ వద్ద నాలుగు నుంచి ఐదు కుటుంబాలు జీవనం సాగించేవి. ఏటా ఇటుకల ధరలు పెరుగుతూ వచ్చేవి. వేసవితో పాటు అన్ని కాలాల్లో వాటి సీజన్ నడిచేది. మట్టి ఆధారంగా ఈ ఇటుకలకు డిమాండ్ కూడా అధికంగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. కొంతకాలంగా ఇటుకల వ్యాపారం మందగించింది. ఇటుకలు కొనే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా వాటి ధర పతనమైంది. నిర్మాణాలు పూర్తిగా తగ్గిపోవడంతో ఇటీవల ఈ పరిశ్రమలు ఎత్తేసి, వేరే పనులకు కుటుంబాలు వలసపోతున్నాయి. వాటిని నమ్ముకుని పెట్టుబడి పెట్టిన వ్యాపారులు సొమ్ముచేసుకోలేక తంటాలు పడుతున్నారు.

అమాంతం పడిపోయిన ధర

గతంలో ట్రాక్టర్ (2000) ఇటుకల ధర రూ.10 వేలు ఉండేది. ఈ ధర ఆయా ఇటుక బట్టీల వద్ద పలికేది. రవాణా చార్జీలు అదనంగా రూ.1500లు నుంచి రూ.2500లు వరకూ ఉండేవి. రాజాం మండలంలోని పొగిరి, కొత్తపేట, పెనుబాక తదితర ప్రాంతాల్లో ఇటుకకు డిమాండ్ ఉండేది. రేగిడి మండలంలోని కుమ్మరి అగ్రహారం, తాటిపాడు, లక్ష్మణవలస, ఖండ్యాం ప్రాంతాల వద్ద ఇటుక తయారీ అధికంగా ఉండడంతో పాటు తరలింపు కూడా చాలా ఎక్కువగా ఉండేది. సంతకవిటి మండలంలోని రంగారాయపురం, మేడమర్తి, పోడలి, తాలాడ ప్రాంతాల్లో ఇటుక బట్టీలకు మంచి డిమాండ్ ఉండేది. ఇటుక ధరల్లో తగ్గేది లేదన్నట్లుగా వ్యాపారులు విక్రయాలు చేసేవారు. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ఇటుక పరిశ్రమలు ముందుకు నడవడంలేదు. బట్టీల వద్ద ట్రాక్టర్ ఇటుక ధర ఒక్కసారిగా రూ.7,500లు, రూ.8వేలకు పడిపోయింది. కొన్ని పరిశ్రమల వద్ద ఇటుకలను కొనుగోలు చేయని పరిస్థితి ఉంది. నిర్మాణాలు మందగించడంతో ఇటుక పరిశ్రమల వద్ద ఇటుకలు అలానే దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి ఇటుకల విక్రయాలు జరగకపోవడంతో వాటి నిమిత్తం పెట్టిన పెట్టుబడికి వడ్డీలు చెల్లించలేక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వర్షాల కారణంగా ఇటుకబట్టీలు తడిసిముద్దవుతున్నాయి. లక్షలాది రూపాయల పెట్టుబడులతో పెట్టిన ఇటుకబట్టీలు వ్యాపారం లేక వెలవెలబోతుండగా, ఇటుక పరిశ్రమలు పెట్టిన వ్యాపారులు, రైతులు దివాలా తీసే పరిస్థితి కనిపిస్తోంది. రాజాం నియోజకవర్గంలో 210కి పైగా ఇటుక పరిశ్రమలు ఉన్నాయి.



రాజాం మండలం పొగిరి సమీపంలో కొను గోలుదారుల కోసం ఎదురుచూస్తున్న ఇటుకబట్టీలు

ఇటుక బట్టీ నిలిపివేశాం

మండలంలోని అగ్రహారం వద్ద మాకు ఇటుకల బట్టీ ఉండేది. గత ఏడాదికాలంగా డిమాండ్ తగ్గిపోయింది. దీంతో చేసేదిలేక ఇబ్బందులు పడ్డాం. అప్పులకు వడ్డీలు చెల్లించలేక వేరే పనులు చేస్తూ అప్పులు తీర్చే ప్రయత్నాలు చేస్తున్నాం.

కె. వెంకటరమణ, ఇటుకల వ్యాపారి, అగ్రహారం, రేగిడి మండలం

పెట్టుబడి లేక నష్టపోతున్నాం

గతంలో ఇటుకలకు డిమాండ్ ఉండేది. ఇప్పుడు ఈ డిమాండ్ లేదు. మండలంలోని ఓ గ్రామం వద్ద రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి నాలుగు ఇటుకబట్టీలు పెట్టాం. పెట్టుబడికి వడ్డీలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.

ఎం.అప్పలనాయుడు, ఇటుకల వ్యాపారి, రాజాం

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామ సమీపంలోని మామిడిచెట్టు కింద పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం అరెస్టు చేశామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నామని, వారి దగ్గర నుంచి రూ. 6140లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

మరో ఏడుగురు పేకాట రాయుళ్లు..

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని అమృత ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్థలంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం అరెస్టు చేశామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై వై.రవికిరణ్‌తో పాటు సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారన్నారు. ఈ దాడిలో పేకాటరాయుళ్ల నుంచి రూ.62,430లుతోపాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

21న ఆదర్శ పాఠశాల ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

పార్వతీపురం టౌన్: ఆదర్శ పాఠశాలలో 2025-2026 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్షను ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తామని డీఈఓ రమాజ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పర్వదినం సందర్భంగా సెలవు కావడంతో పరీక్ష తేదీ మార్పుచేసినట్టు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.